# చేజారిన ఛాన్స్!

'పటాటోపం' వీక్లీ ఆలాఆషామాషీ పత్రికేం కాదు. పాతికేళ్ళ చరిత్ర వుంది. లక్షల్లో సర్క్యులేష నుంది. పాఠకుల్లో మోజుంది... క్రేజుంది!

వారం తిరక్కముందే సంచిక మార్కెట్లోకి ఎప్పుడొస్తుందాని పాఠకదేవుళ్ళు వళ్లంతా కళ్ళు చేసుకు నిరీక్షిస్తుంటారు. అదీ ఆ పత్రికకున్న గ్రేస్!... గ్రేట్నెస్!!

ఎంతో కీర్తి ప్రతిష్టలను ఆర్జించిన నేటి మేటి వారపత్రికది! ఆ వీక్లీలో జీవితకాలంలో ఒక్కకథైనా అచ్చయితే చాలు జీవితం చరితార్థమౌతుందనుకునే రచయితలు కోకొల్లలు.

దాని ఆఫీసు అత్యంత సుందర భవనం!... కాదు కాదు అదొక అద్దాలమేడ! అందులో పనిచేసేవారికి తప్ప ఇతరులెవ్వరికీ ప్రవేశం లేదు. ట్రెస్‌పాసర్స్ కఠినంగ శిక్షించబడతారనే బోర్డు భయపెడుతూ వుంటుంది. అదొక నిషిద్ధ ప్రదేశం!

ఛీఫ్ ఎడిటర్... అసోసియేట్ ఎడిటరు... డిప్యూటీ ఎడిటరు... అసిస్టెంట్ ఎడిటర్... ఫీచర్స్ ఎడిటర్... ఇంకా ఎన్నో కేటగిరీల సంపాదకులు అక్కడ పనిచేస్తున్నారు.

పత్రికను నిత్యనూతనంగా తీర్చిదిద్దటానికి అహర్నిశం వారంతా పాటుపడుతుంటారు. సమర్థత గలవారికి మాత్రమే అక్కడ చోటు!

రచయిత(త్రు)లెవరూ ఎడిటోరియల్ సిబ్బందిని కలిసే వీలుండదు. ఫోన్లో మాట్లాడాలన్నా కనెక్షన్ ఇవ్వరు. సెక్యూరిటీ విజిలెన్స్ స్ట్రిక్ట్‌గ వుంటుంది.

ప్రచురణకు అంగీకరించిన రచనకు పారితోషికం నాలుగు అంకెల్లో వుంటుంది. సాధారణ ప్రచురణకు స్వీకరింపబడాలంటేనే తాతలు దిగొస్తారు. ఇక పోటీల్లో ప్రైజు కొట్టటమంటే ఎంత 'థ్రిల్లో' మాటల్లో చెప్పటం అసాధ్యం. కౌన్ బనేగా కరోర్‌పతిలో విన్నింగ్ ఛాన్స్ కొట్టినట్టే!

పోటీల్లో పాల్గొనే వారంతా వీరగంధం పూసుకుని... శ్రీరామచంద్రుడు శివధనుర్భంగంలో శ్రమించినంతగ కష్టపడాల్సి వుంటుంది. ప్రైజులు తన్నుకుపోవాలంటే క్రితం జన్మలో పుణ్యం చేసుకుని పుట్టినవారై వుండాలి!

వీరాధివీరులు... శూరాధిశూరులు..... కత్తుల్లాంటి కలాలు దూసి పోటీకి తలపడతారు. అలాంటిది... సీదాసాదా రైటర్స్ సంగతి చెప్పనే అక్కర్లేదు. విజయానికి ఆమడదూరంలో చతికిలబడతారంతే!

పటాటోపం వీక్లీ ఆఫీసులో స్టోరీ సెక్షన్ సంపాదకుడు మార్జాలరావ్! పత్రిక పుట్టిననాటినుండి

ఎఫిషియంట్ కావున అదే సీట్లో వున్న ఘనుడు! కథలు చదివి సెలక్ట్ చేయటమంటే అతనికి లెఖ్కలోని విషయంగాదు.

మార్జాలరావ్ ఆల్మోస్ట్ ఓ అజ్ఞాతవ్యక్తి! అతను ఎలావుంటాడో... రూపురేఖలేమిటో చాలామందికి తెలీదు. రచయితల కంటపడితే ఎక్కడ పీక్కుతింటారో... లేక బలవంతంగ ఏ బార్కో లాక్కెడతారోనని భయం మూలాన ముసుగువీరుడిలా బైట తిరుగుతుంటాడేమో తెలీని విషయం.

ఇన్నేళ్ళుగా పత్రికాఫీసు కొచ్చే వందలాది కథలు చదివి చదివీ మతిభ్రమించి... కొన్నాళ్ళు వైజాగ్ పిచ్చాసుపత్రిలో షాక్ ట్రీట్మెంట్ పొంది... పెళ్ళాం తాళి గట్టిదవటం వల్ల డిశ్చార్జై క్షేమంగా ఇల్లు చేరుకున్నాడు.

మార్జాలరావ్లో ఓ ప్రత్యేకత వుంది! అదేమిటన...? కవరులో వుండే కథ చదవకపోయినా దాని నాడి పరీక్షించి కథలో ఎంత పస వుందో... అచ్చుకు నోచుకుంటుందో లేదోని... కథ జాతకం చెప్పెయ్యగలడు! అది అతనిలో ఉన్న టాలెంట్! అకారణంగానే ఆ పత్రికాఫీసులో ఫెవికాల్ లాగ అతుక్కుపోయాడు.

చేతికొచ్చిన ప్రతి కథా 'లైన్ టు లైన్' శ్రద్ధగా చదవగల ఓర్పుంది. ఓపెనింగ్ పేరా చదివో... ముగింపు చదివో... టైటిల్ చూసో... రచయిత పేరు బాగుందనో కథలు సెలెక్ట్ చేసే అలవాటు మార్జాలరావ్కి లేదు. మనిషి సిన్సియర్ అండ్ హానెస్ట్!

అతనంటే కథలకీ హడలే! పేరుకే మార్జాలరావ్ గాని వుద్యోగం చేయటంలో మహిషానికి తీసిపోడు!

చేతికొచ్చిన ప్రతి కథా విలవిల్లాడి పోవాల్సిందే! తనను సెలెక్ట్ చేయమని అర్థిస్తుంది! దీనాతిదీనంగా వేడుకుంటుంది. కంట తడిపెడుతుంది. చెత్తబుట్ట పాలు చేయవద్దని వేడుకుంటుంది.

అయినా జాలిచూపని పాషాణహృదయం మార్జాలరావ్ది!

గ్రేటర్ హైదరాబాద్లో చేయి తిరిగిన కథా చక్రవర్తి శునకేశ్వర్రావ్.

అదేం పేరని కొత్తల్లో అందరూ ఆశ్చర్యపోగా... తన మీద తానే ఓ కథ రాసేసుకుని... పేరెంట్స్ తనకు అలాంటి ప్రత్యేకమైన పేరు పెట్టటంలో గల రహస్యం చెప్పుకున్నాడు.

శతాధిక గ్రంథకర్త శునకేశ్వర్రావ్!... కథా చక్రవర్తి... నవలా సామ్రాట్... ఇత్యాది బిరుదులున్న ఘనాపాటి. ఒకట్రొండు విశ్వ విద్యాలయాలు అతగాడికి గౌరవ డాక్టరేటిచ్చి గౌరవించిన చరిత్ర వుంది.

శునకేశ్వర్రావ్ రచనలకు మంచి ఫాలోయింగ్ వుంది. వేల సంఖ్యలో ఫాన్లూ వున్నారు.

జిల్లాస్థాయిలో అభిమాన సంఘాలున్న వ్యక్తి!

పత్రికలు అతగాడికి లెటర్స్ రాసి మరీ కథలు నవలలు తెప్పించుకుని అచ్చేస్తయ్. అంత సత్తా వున్న మనిషి!

ఏ పత్రికకు ఎంత సర్క్యులేషనుంది?... ఎంత రెమ్యూనరేషన్ ఇస్తుంది? అనే ప్రశ్నల జోలికి పోడు.

కొత్తగా పత్రిక ప్రారంభిస్తున్నామంటూ కథకోసం లెటర్ ఎవరైనా రాసిందే తడవు... ఠపీమని ఓ కథ పంపటం అతని అలవాటు.

కేంద్ర రాష్ట్ర సాహిత్య అకాడమీలు ఆయన నవలకు కథాసంపుటాలకు బహుమతులు ప్రసాదించినయ్.

అయినా మనిషిలో కించిత్ గర్వంలేదు. అరవై దాటిన అందగాడు.

ఆయన రచన అచ్చుకాని పత్రికంటూ లేదు ఆంధ్రదేశంలో... ఒక్క 'పటాటోపం' వీక్లీ తప్ప!

రాని బహుమతి అంటూ లేదు... ఒక్క పటాటోపం నిర్వహించే వివిధ రకాల పోటీలు తప్పించి.

శునకేశ్వర్రావ్ వర్రీ అంతా ఒక్క 'పటాటోపం' పత్రిక గురించే! ఆ వీక్లీలో తన రచనలు ఎందుకు అచ్చుకు నోచుకోవు? అనేదే ఆయన ప్రశ్న... కాదు దిగులు!

రచనా రంగంలో నలభైయేళ్ళ అనుభవం తనది! అయినా ఆ ఒక్క పత్రిక విషయంలో ఫెయిలవుతూ వస్తూండటం ఓ పెద్ద వర్రీగా తయారైంది. అవమానభారంతో కుంగిపోక తప్పటంలేదు.

అభిమాన సంఘాలవారు... పాఠకులు అతని శిలావిగ్రహాన్ని టాంక్‌బండ్‌మీద ప్రతిష్ఠ చేస్తామని బలవంతం చేసినా... బ్రతికి వుండగా దేనికని ససేమిరా అన్నాడు.

అలనాడు మయసభలో సుయోధనుడికి జరిగిన అవమానం కంటే వేయిరెట్లు ఎక్కువై తన రచన 'పటాటోపం' వీక్లీలో అచ్చుకాకపోవటంతో తల తీసేసినట్టుంది శునకేశ్వర్రావ్‌కి!

మంచి హ్యూమరున్నవాడు. ఎప్పటికైనా 'పటాటోపం' పత్రికలో తన కీర్తి పతాకం ఎగుర వేయాలనేదే అతని పట్టుదల.

ఏం సార్... ఈ మధ్య కన్పించటంలేదని ఎవరైనా ప్రశ్నిస్తే... కన్పించనిది తనా?... పత్రికల్లో తన రచనాలని హాస్యపూరిత ధోరణిలో జవాబిచ్చే చతురుడు.

శునకేశ్వర్రావ్ చిరకాలమిత్రుడు వామనరావ్ వీధిలో ఎదురై 'ఏమోయ్!... నీ కథలు 'పటాటోపం' పత్రికలో అచ్చవుతున్న దాఖలాలెక్కడా కన్పించటం లేదే?...' పలుకరించాడు.

ఆ పలుకరింపు చమత్కారమో... ఎద్దేవో... పరిహాసమో... దెప్పిపొడుపో గ్రహించలేనంత అమాయకుడేం కాదు తాను.

"ఏం చెప్పను? అదొక 'సాడ్ స్టోరీ' తలదించుకున్నాడు సీనియర్ సిటిజన్ శునకేశ్వర్రావ్.

★★★★★

'నీ అంతటి వ్యక్తి నిరుత్సాహంతో నీరుకారిపోతగునా?' ముక్కున వేలేసుకున్నాడు వామనమూర్తి.

'ఏమిటీ... చాలా రోజులకు దర్శనమిచ్చావ్?...' టాపిక్ మారుస్తూ ప్రశ్నించాడు.

'నిన్ను కలుద్దామనే బయల్దేరాను. వెతకబోయిన తీగ కాళ్లకు చుట్టుకున్నట్టు... నీ దర్శనం మార్గమధ్యంలోనే అయింది...'

'ఏమిటి విశేషం?'

'నీ రెండో కొడుకు మోహన్ లేడూ... అదే నోయ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు... వాడికో మాంఛి సంబంధం వెతికాను...'

ఇద్దరూ దగ్గర్లో వున్న పార్క్‌లోకి నడిచి ఓ మూల సిమెంట్ బెంచీమీద కూర్చున్నారు.

'నేను చెప్పబోతున్నది కూడా...' నీ స్థాయికి తగిన సంబంధమే...'

'సస్పెన్స్ దేనికీ? విషయానికిరా...'

'ఈమేచ్ సెటిలైతే నాకేమిస్తావ్?'

'బ్రోకరేజా?'

'చాల్లే నీ పరిహాసం! పిల్ల తండ్రి ఎవరో కాదు... 'పటాటోపం' పత్రికాఫీసులో ఎడిటర్ మార్జాలరావ్...'

'ఆగాగు... ఏమన్నావ్? మార్జాలరావా? పత్రిక ఆఫీసులో ఎడిటరా?... మరైతే మార్జాలానికి శునకానికీ బుద్ధవైరం కదా?-' జోకేడు శునకేశ్వర్రావ్.

'అన్నీ కుదిరేట్టు చేస్తాను. సరేనా! మంచి సాంప్రదాయం కల కుటుంబం వాళ్లది. అతని కూతురు చక్కని చుక్క!'

శునకేశ్వర్రావ్ మనసు ఎగిరి గంతేసింది. తన రొట్టె విరిగి నేతిలో పడబోతోందన్నమాట!

పైకి మాత్రం తొణక్కుండ గంభీరంగ ఫోజు పెట్టాడు.

★★★★★

జాతకాలు కుదిరాయి కాబట్టి పెళ్ళిచూపుల తంతు ఏర్పాటు చేయించాడు వామనమూర్తి.

మార్జాలరావ్ ఇంటికి తరలివెళ్ళింది శునకేశ్వర్రావ్ ఫ్యామిలీ!

'అయ్యా... నాకు నలుగురూ ఆడపిల్లలే! ఈ అమ్మాయి మూడవది దీనికి వంటవార్పు వచ్చు. కంప్యూటర్ కోర్సు చెప్పించాను. మీరు కావాలనుకుంటే వుద్యోగం చేయించుకోవచ్చు!... నా సంపాదన తప్పించి ఆస్తిపాస్తులేమీ లేవు...'

పిల్ల తండ్రి మాటకి అడ్డొస్తూ 'కథ మీరు చెప్పద్దు. పాయింట్ చెప్పండి చాలు! కథనెలా రాయాలో... సారీ... నడిపించాలో నే చూసుకుంటాను...' మాట్లాడేడు శునకేశ్వర్రావ్.

'బావగారు చతురులే! నేను మీ అంత గొప్పవాడిని కాదు. పిల్ల నచ్చితే మీ నిర్ణయం చెప్పండి. కట్నకానుకలు ఇచ్చుకోలేకపోయినా... పెళ్ళి మీ స్థాయికి తగ్గకుండా చేస్తాను'

ఇంతలో వామనమూర్తి జోక్యం చేసుకుంటూ 'ఇక్కడో తిరకాసుంది - అదేమిటంటే?... మీ అమ్మాయి వారి అబ్బాయికి నచ్చి సంబంధం ఖాయమైతే...'

'ఆ! అయితే...' నోరు తెరిచాడు మార్జాలరావ్.

'ఏం లేదు. కట్నం మావాడు ససేమిరా పుచ్చుకోడు... కాకపోతే...'

ఆ గొంతెమ్మ కోరికేమిటో చెప్పరూ అనే భావనతో వామనమూర్తి కేసి చూశాడు మార్జాలరావ్.

'మావాడు మీ పత్రికకు పంపే ఏ రచనా తిరిగి వెనక్కురాకుండా చూచుకోవలసిన బాధ్యత మీది! వీలైనన్ని ఎక్కువ కథలు మీ పత్రికలో చోటు చేసుకోవాలి! అలా అని మీరు మాటివ్వాలి...'

వామనమూర్తి మాటలు విన్న మార్జాలరావ్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా అయింది. నో అంటే సంబంధం బెడిసికొడుతుంది. ఎస్సంటే... తన ప్రిన్స్‌పుల్స్‌కే ఎసరొస్తుంది.

కాసేపు మధనపడి 'సరే కానివ్వండి. మేము ఆడపెళ్ళివారం కదా?!- మగపెళ్ళివారేమడిగినా కాదనకూడదు... మంచిరోజు చూచి తాంబూలాలు పుచ్చేసుకుందాం! ఏమంటారు శునకేశ్వర్రావ్ బావగారూ...?' మనసులో నిర్ణయాన్ని మెల్లగా బైటపెట్టాడు మార్జాలరావ్.

కాబోయే వియ్యంకుడి నిర్ణయం విన్న శునకేశ్వర్రావ్ సంబరపడి చంకలు గుద్దుకున్నాడు.

మేరేజ్‌హాల్లో కూతురు వివాహం శోభాయమానంగా జరిపించాడు మార్జాలరావ్.

అలస్యం అమృతం విషం అనుకున్న శునకేశ్వర్రావ్ లేటెస్ట్‌గా రాసిన వేయి పేజీల నవల... ఫెయిర్ చేసి వుంచిన రెండు కథలు 'పటాటోపం' వీక్లీకి కొరియర్ ద్వారా పంపేడు. తాను వాటిని పంపిన సంగతి వియ్యంకుడు మార్జాలరావ్‌కి ఫోన్‌చేసి చెప్పాడు.

పబ్లిష్ చేయక ఎక్కడికి పోతాడు...? ఆడపిల్ల తండ్రిగా కాదన్లేదు. పైగా పెళ్ళికిముందు కమిట్ కూడా అయినాడు.

అందుకే అవి పబ్లిష్ అవటం ఖాయం అనుకుని ధైర్యంగా వున్నాడు శునకేశ్వర్రావ్.

ఒకరోజున కూతురు కాపురం ఎలా వుందో చూచిపోదామని శునకేశ్వర్రావ్ ఇంటికొచ్చాడు మార్జాలరావ్. కాఫీ ఫలహారాల కార్యక్రమం ముగిశాక... తాను పంపిన రెండు కథలు... పెద్ద నవల సంగతేం చేశారంటూ ప్రశ్నించాడు.

అందుకాయన అదోలా నవ్వి 'మీకు తెలీదా బావగారూ... క్రితం వారంలో నేను సూపర్ ఏన్యువేషన్ మీద రిటైరైనాను. ఇక నాకు పత్రికాఫీసుకు ఎలాంటి సంబంధ బాంధవ్యాలూ లేవు. సారీ... మీ కోరిక మన్నించగల అవకాశం లేకపోయింది. మరోలా భావించకండి...' అసలు విషయం వెళ్ళగక్కేడు మార్జాలరావ్.

ఆ మాట విన్న శునకేశ్వర్రావ్‌కి గుండె ఆగినంత పనయింది. ఇలా జరిగిందేమిటి చెప్మా అనుకుని బాధపడ్డాడు. రిటైర్మెంట్ సంగతి ముందుగా తనకు తెలిసివుంటే తానా రచనలు పంపి వుండేవాడే కాదన్పించింది.

బంగారంలాంటి అవకాశం చేజారిపోయినందుకు మనస్సు చిన్నపుచ్చుకున్నాడు శునకేశ్వర్రావ్.

- సమాప్తం -

*(చినుకు మంత్లీ, 2009 మే సంచిక)*